క్లుప్తంగా

రైల్వే రిజర్వేషన్ కార్యాలయం మార్పు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):బెంజిసర్కిల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోని రైల్వే రిజర్వేషన్ కార్యాలయాన్ని ఎంజీ రోడ్డు, మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్ వద్ద ఈట్ స్ట్రీట్‌కు మార్చునున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వేషన్ కౌంటర్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రజలు ఈ మార్పును గమనించి రైల్వే సేవలు పొందాలని కోరారు.

పది తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కేబీఎన్ కళాశాలలో 2023 పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షల్లోనూ తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి వారిని పరీక్షలకు హాజరయ్యేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తామని, ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. తరగతులను 13వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 7995593859లో సంప్రదించాలని కోరారు.

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.3.08 లక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భక్తులు సమర్పించిన కానుకల హుండీల ద్వారా స్వామి వారికి రూ.3,08,040 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు తెలిపారు. మార్చి నాలుగు నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకల హుండీలను బుధవారం లెక్కించినట్లు పేర్కొన్నారు. హుండీల ద్వారా ఒక గ్రాము బంగారం, రెండు కిలోల 470 గ్రాముల వెండి లభించినట్లు పేర్కొన్నారు. హుండీల లెక్కింపును శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్ బాబు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారన్నారు.

మహిళకు పానీపూరీ బండి అందజేత



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మానవ సేవే మాధవ సేవ అనే భావనతో బొప్పన రాధమ్మ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పలువురు పేర్కొన్నారు. కేఎల్‌రావు నగర్ 6వ లైన్‌కు చెందిన చింతా శివప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతుండగా , దాతలు సహకరించి వ్యాపారం చేసుకునేందుకు సాయం అందించాలని కోరారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన బొప్పన రాధమ్మ శివప్రసాద్ భార్య కుమారి చిరు వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. పానీపూరీ బండి, వ్యాపారానికి అవసరమైన సరుకులు, ఆర్థిక సాయాన్ని బుధవారం రాధమ్మ ప్రతినిధులు బుధవారం కుమారికి అందచేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బ్రహ్మంగారి మఠంకు చెందిన వేంపడపు శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బుడుముల అనూషకు విజయనగరానికి చెందిన యువకుడిని ఇచ్చి వివాహం జరిపించారు. ఆరోగ్యం సరిగా లేదని అనూష నెల రోజుల కిందట తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. బుధవారం ఉదయం దుర్గగుడికి వెళ్లి వస్తానని చెప్పి ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెట్టి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్:నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 144(2) సీఆర్‌పీసీ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 28వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో నలుగురు, అంతకుమించి ఎక్కువ మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడరాదని తెలిపారు. కర్రలు, రాళ్ళు, మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని హెచ్చరించారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ధ్రువీకరణ పత్రాలు



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 46వ డివిజన్ పరిధిలోని 145వ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గడప గడపలో ప్రతి పేదవాడి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని రీతిలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తుందని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామన్నారు. గతంలో ప్రజలు తమకు అవసరమైన పత్రాల కోసం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాయన నరేంద్ర, డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీకుమార్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నగర పాలక సంస్థ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో....

జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం 45వ డివిజన్ పరిధిలోని కబేళా సచివాలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అర్హులైన వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, నృత్య అకాడమీ డైరెక్టర్ భట్టిపాటి సంధ్యారాణి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

● జోరుగా గొడుగుల విక్రయాలు





గుణదల రామవరప్పాడు రోడ్డుపై గొడుగులు అమ్ముతున్న మహిళలు

వర్షాకాలం ప్రారంభం కావడంతో గొడుగులకు డిమాండ్ పెరిగింది. రోజూ ఏదొక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన వారు వర్షాల్లో రాకపోకలు సాగించేందుకు వీలుగా గొడుగులను వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో గొడుగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గుణదల రామవరప్పాడు రోడ్డుపై రంగు రంగుల గొడుగులు విక్రయిస్తున్న దృశ్యాలివి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ముస్లింల సంక్షేమానికి జగనన్న కృషి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న మైనార్టీ నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్‌మోహిద్దీన్ తెలిపారు. 'హర్ దిల్ మే వైఎస్ఆర్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పాత ఆర్ఆర్ పేటలోని మస్జిదే నయూం ను సందర్శించారు. మసీదు పెద్దలు సయ్యద్ ఖాజా హుసేన్, అబ్దుల్ సలాం, షేక్ హనీఫ్‌తో సమావేశం నిర్వహించి మసీదు అభివృద్ధికి చేపట్టాల్సి చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో ముస్లిం మైనార్టీలు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. ఇమామ్, మౌజన్ జీతాలు పెంచిన జగనన్నకు తాము రుణపడి ఉంటామని పేర్కొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తరువాత ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. అనంతరం ప్రభుత్వం మైనార్టీలకు అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు షేక్ బాజీ, షాషీద్, బడేమియా, నాగూల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త హ్యుందాయ్ కారు



కొత్త కారును ప్రారంభిస్తున్న చుక్కపల్లి సిద్ధార్థ

ఆటోనగర్(విజయవాడతూర్పు):హ్యుందాయ్ కంపెనీ కొత్త కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. లబ్బీపేటలోని హ్యుందాయ్ షోరూంలో ఈ కొత్త కారును ప్రవేశపెట్టారు. విజయవాడ ఆటోనగర్ బ్రాంచ్‌లో హ్యుందాయ్ ఎక్సర్, ఫ్యామిలీ బడ్జెట్‌లో ఫుల్లీ లోడెడ్ (ఎస్‌యూవీ) కారును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ చుక్కపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ హ్యుందాయ్ ఎక్సర్ ఫ్యామిలీ బడ్జెతో వస్తుందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఆరు ఎయిర్ బ్యాగ్స్, 60కి పైగా కనెక్టివిటీ ఫ్యూచర్స్‌తో ఉందన్నారు. ఫుల్లీ ఆటోమేటిక్ టెంపరేచర్, క్రూస్ కంట్రోల్ టచ్ స్క్రీన్ ఉందన్నారు. ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, హిల్ అసిస్ట్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్‌తో పాటు రెండు రకాల ఇంజిన్‌లతో పెట్రోలు, బై ఫ్యూయల్ పెట్రోలు, సీఎన్‌జీ ఉన్నాయన్నారు. ఇతర కారులకు ధీటుగా వినియోగదారులకు అందుబాటు ధరలో ఉన్నాయన్నారు. ఈ కారు ప్రారంభం ధర రూ.5.99 లక్షలు అన్నారు. టెస్ట్ డ్రైవ్ కోసం సమీపంలో ఉన్న కుశలవ హ్యుందాయ్ షోరూంను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టి.వెంకటరెడ్డి, ఎం.నందకిషోర్, ఎస్‌బీఐ మేనేజరు శర్మ, కొటక్ బీఎం సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

16న మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ



పోస్టర్ ఆవిష్కరణలో మంచికంటి, చలపాక ప్రకాష్, కలిమిశ్రీ, అరసవిల్లి కృష్ణ తదితరులు

విజయవాడ కల్చరల్: మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో 16వ తేదీ సర్వోత్తమ భవన్‌లో గ్రంథాలయ ఉద్యమ సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘ సభ్యుడు మంచికంటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు రోడ్డు అనేక బుక్ స్టాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రంథాలయాలను ప్రజలందరికీ చేరువ చేయాలని, భాషా వికాసానికి కృషి చేయాలనే సంకల్పంతో సభ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 గంటలకు సంకల్పయాత్రతో కార్యక్రమాలు ప్రాంభమవుతాయని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు సమావేశంలో పాల్గొంటారన్నారు. చర్చలు, పుస్తక ఆవిష్కరణల అనంతరం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కవులు, రచయితలు తమ అభిప్రాయం తెలియజేయవచ్చన్నారు. సాహితీవేత్తలు చలపాక ప్రకాష్, కలిమిశ్రీ, మందరపు హైమావతి, అరసవిల్లి కృష్ణ, అలెగ్జాండర్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు. అతిథులు పోస్టర్ ఆవిష్కరించారు.





● పడవలతో కాల్వల పరిరక్షణ

నగరంలోని బందరు, ఏలూరు, రైవస్ కాల్వల పరిరక్షణకు నగర పాలక సంస్థ అధికారులు నడుం బిగించారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు చేరకుండా పర్యవేక్షించేందుకు పడవలను సిద్ధం చేస్తున్నారు. మూడు కాల్వల మధ్యలో చెత్తా చెదారం సైతం పడవల ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు ప్రకాశం బ్యారేజీ సమీపంలో పడవలను సిద్ధం చేస్తున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యతో జీవితంలో ఉన్నత స్థాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి పి. రాజారాం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని మంచి ఉద్యోగం చేసి సంఘంలో గౌరవ ప్రతిష్టలతో జీవించాలని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి. రాజారాం తెలిపారు. విద్యాధరపురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలోని బాలురకు బుధవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

కృష్ణా జిల్లా బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి, బెంగళూరుకు చెందిన న్యాయవాది బి. వనదుర్గలు సుమారు రూ. 20 వేల విలువైన 30 జతల వస్త్రాలు, యూనిఫాంను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి. రాజారాం హాజరయ్యారు. తొలుత హాస్టల్‌లోని పిల్లలతో మాట్లాడారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు స్నేహాలు చేయవద్దని సూచించారు. అసాంఘిక చర్యలకు పాల్పడటం వల్ల జీవితం పాడవుతుందన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చంద్రగిరి రాధాకుమారికి అభినందనలు తెలియజేశారు. త్వరలోనే బాలుల గృహానికి రక్షిత మంచినీటిని సరఫరా చేసే యంత్రాన్ని అందిస్తామని రాధాకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సెలర్ జె. జయలక్ష్మీ, పానెల్ అడ్వకేట్ పీ.రాము, పర్యవేక్షణాధికారి పి.రామ్మోహనరెడ్డి, ప్రొబేషన్ ఆఫీసర్ ఎండీ. హుస్సేన్ ఆలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకారం అందించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఇందిరా నాయక్ నగర్‌లో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ పోస్టు మాస్టర్ ఆర్.రామచంద్రరావు చుక్కపల్లి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సామాన్య పోస్టు మాస్టర్ ఉద్యోగం చేసిన రామచంద్రరావు పదవీ విరమణ అనంతరం స్వచ్ఛ విజయవాడకు సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. గత 26 సంవత్సరాల నుంచి పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తూ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను అందిస్తోందన్నారు. వీటితో పాటు రామచంద్రరావు లాంటి దాతలు ముందుకు వచ్చి ప్రతి సంవత్సరం తమ సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు.కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ విశ్రాంత పోస్టు మాస్టర్ రామచంద్రరావు కాలనీలలో మొక్కలు నాటి స్వచ్ఛత పై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలి

మంత్రిని కలిసిన నగరాల ప్రముఖులు



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను కలిసిన నగరాల ప్రముఖులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలని బీసీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను పలువురు నగరాల ప్రముఖులు కోరారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం మంత్రిని బీసీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రావు, కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడులతో పాటు పలు నగరాల సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. నగరాలను బీసీలుగా అన్ని జిల్లాలో గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను కోరడం జరిగిందని, ఈ మేరకు మంత్రిని కలవడం జరిగిందని ఎన్వీ.రావు పేర్కొన్నారు. నగరాల ప్రముఖులు తమ్మిన హేమంత్, మజ్జి శ్రీను, బాయన శేఖర్‌బాబు, పైలా సురేష్, ప్రముఖ న్యాయవాది పిళ్లా రవి, పొట్నూరి శివ, బాయన కనకారావు, శీరం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ పేదల వ్యతిరేకి



పవన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ముమ్మాటికీ పేదల వ్యతిరేకి అని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ మారేష్ అన్నారు. ఏపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్షద్ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పంజా సెంటర్ వద్ద బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మారేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వారధిలా పని చేస్తున్న వలంటరీ వ్యవస్థను అవమానించడం దుర్మార్గమన్నారు. దీనిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వలంటరీ వ్యవస్థకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటరీలను అవమానించడం అంటే పేదలను అవమానించినట్లేనని పేర్కొన్నారు. పవన్ కేవలం తన రాజకీయ ఉనికి కోసం మాట్లాడుతున్నాడే తప్ప తన పార్టీకి గాని తనకి గాని ప్రజల మీద ఎటువంటి ప్రేమ లేదన్నారు. చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలనే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రపంచ దేశాలన్నీ వాలంటీర్ వ్యవస్థ గురించి ప్రశంసిస్తుంటే పవన్ విమర్శించటం సిగ్గు చేటన్నారు. వలంటరీ వ్యవస్థ నడుము ఇరగ కొడతానని మాట్లాడటం పవన్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను పవన్ కళ్యాణ్ అవమానించినట్లేనని తెలియజేశారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి నాయకులు పంచుమర్తి లక్ష్మీ భీమేష్, శ్రీనివాస్ , ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కూతురు అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లీ కూతురు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం శివాలయం సెంటర్‌కు చెందిన పాకనాటి పుల్లారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. 10 రోజుల క్రితం పుల్లారావు తల్లి, భార్యకు మధ్య గొడవ జరిగింది. గొడవ తర్వాత అతని తల్లి సొంతూరు బండిపాలెం వెళ్లిపోయింది. ఈ నెల 11న భవానీపురంలోని కొడుకు వద్దకు తిరిగి వచ్చింది.

గొడవ నేపథ్యంలో అత్తా, కోడళ్లు మాట్లాడుకోవడం లేదు. పుల్లారావు తన తల్లితో మాట్లాడాలని భార్య నాగమణిని అడిగాడు. ఆమె అందుకు నిరాకరించింది.

దీంతో ఒకే ఇంట్లో ఉంటూ మాట్లాడకపోతే ఎలా అంటూ భార్యను నిలదీశాడు. తన తల్లితో మాట్లాడకపోతే పుట్టింటికి వెళ్లిపోమని మందలించి స్నానం చేసేందుకు వెళ్లాడు. వచ్చి చూడగా భార్య నాగమణి, కుమార్తె అనూష కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఇద్దరి ఆచూకీ లభించలేదు. దీనిపై భవానీపురం పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన విద్యా విధానంతో మెరుగైన భవిత

గుణదల: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే దిశగా ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం దోహదపడుతుందని లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జీఏపీ కిషోర్ అన్నారు. ఇటీవల అమలు చేసిన సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులను ఆంధ్ర లయోల కళాశాలలో బుధవారం ప్రారంభించారు.